www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 23 జనవరి 2024

25న ఉపాధి కార్యాలయంలో మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ గురువారం ఉదయం 09:30 గంటలకు మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కె.హరిచంద్ర ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెల్టన్ హోటల్ సమీపంలో హెచ్‌పి పెట్రోల్ బంక్ వెనుక ఉన్న జిల్లా కార్యాలయంలో ఈ మేళాను నిర్వహిస్తామన్నారు. ఎస్‌బిఐ లైఫ్, టాటా ట్రెంట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ కొరకు ఫార్మాసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, ఫార్మసీ ట్రైనీ, సేల్స్ ఎక్జిక్యూటివ్, లైఫ్ మిత్రలు, డెవలప్‌మెంట్ మేనేజర్స్ కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులు రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బి/ఎం/డి ఫార్మసీ వరకు చదువుకున్న 18-40 ఏళ్లలోపు వారు అర్హులన్నారు.

అంగన్‌వాడీల నిర్బంధం

- ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు
- 18 గంటలుపైగా పోలీసులు అదుపులోనే...
- టెర్మినేషన్ ఇస్తామంటూ బెదిరింపులు
- ఆందోళనలను కొనసాగిస్తున్న అంగన్‌వాడీలు

గేదెల నూకరాజు కళ్యాణమండలంలో నిర్బంధించిన వివిధ జిల్లాలకు చెందిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- రాజమ హేంద్రవరం ప్రతినిధి

అంగన్‌వాడీల ఉద్యమంపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు సమ్మె చేపట్టిన విషయం విధితమే. న్యాయమైన కోర్కెలను సానుకూలంగా పరిష్కరించాల్సిన ప్రభుత్వం పూర్తి భిన్నంగా వ్యవహరించింది. పలు మార్లు చర్చలకు పిలిచినప్పటికీ సానుకూలంగా స్పందించలేదు. దీంతో గడిచిన 42 రోజులుగా వీధుల్లోకి వచ్చి ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో 'చలో విజయవాడ' పిలుపుతో విజయవాడ వెళ్లేందుకు సిద్ధమైన అంగన్‌వాడీలను పోలీసులు ఎక్కడిక్కడే అరెస్టు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకూ రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్లను జల్లెడ పట్టారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 350 మంది అంగన్‌వాడీలను అక్రమంగా అరెస్టు చేశారు. సుమారు 18 గంటల పాటు నిర్బంధించారు. రాజమహేంద్రవరంలోని బొమ్మూరు పోలీసులు సుమారు 80 కుపైగా అంగన్‌వాడీ కార్యకర్తలను అదుపులోకి తీసుకొని రాజానగరంలోని ఓ ప్రైవేటు స్కూలులో నిర్బంధించారు. టు టౌన్ పోలీసు స్టేషన్ పోలీసులు 40 మందిని అదుపులోకి తీసుకుని ఐఎల్‌టిడి జంక్షన్ సమీపంలోని గేదెల నాగరాజు కళ్యాణ మండపంలో నిర్బంధించారు. ప్రకాష్ నగర్ పోలీసులు సుమారు 100 మందిని పోలీసుస్టేషన్ వద్దనే నిర్బంధించారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు అంగన్‌వాడీల నుంచి సంతకాలు తీసుకుని పంపించారు.

టెర్మినేషన్ చేస్తామంటూ బెదిరింపులు

అంగన్‌వాడీలను టెర్మినేషన్ చేస్తామంటూ ఉన్నతాధికారులు బెదిరింపులకు పాల్పడ్డారు. జిల్లాలోని 7 ప్రాజెక్టుల పరిధిలో 1536 మెయిన్, 26 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు చొప్పున 1562 ఉన్నాయి. మెయిన్ కేంద్రాల్లో ఒక వర్కరు, హెల్పరుతో కలిపి మొత్తం 3072 మంది, మినీ అంగన్ వాడీ కేంద్రాల్లో 26 మంది మొత్తం 3098 మంది విధులు నిర్వహిస్తున్నారు. గడిచిన 42 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న నేపథ్యంలో బెదిరింపు చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఎస్మా ప్రకటించింది. ఆపై షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అంగన్‌వాడీలు వివరణ ఇచ్చేందుకు వెళ్లినప్పటికీ అధికారులు అందుబాటులో లేకపోవటంతో ఐసిడిఎస్ కార్యాలయాల గోడలకు తమ వివరణను రాసి అంటించి వెనుతిరగాల్సి వచ్చింది. తాజాగా మరో అడుగు ముందుకేసి టెర్మినేషన్‌లు అందజేస్తామని ఇప్పటికైనా విధుల్లో చేరాలంటూ ఫోన్‌ల ద్వారా హెచ్చరికలుజారీ చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని డిమాండ్ చేసే వరకూ సమ్మె కొనసాగిస్తామని తేల్చి చెప్పటంతో అధికారులు మరో మార్గాన్ని ఎంచుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 164 మంది విధుల్లో చేరారంటూ సాక్షాత్తు కలెక్టరు కె.మాధవీలత ప్రకటన చేయటం ప్రభుత్వ వైఖరిని దర్పణం పడుతోంది.

టెర్మినేషన్లకు భయపడేది లేదు

ఎస్మా ప్రయోగించినా, టెర్మినేషన్ లెటర్లు ఇచ్చినా డిమాండ్లను నెరవేర్చేవరకూ, సమస్యలను పరిష్కరించే వరకూ ఉద్యమాన్ని ఆపేది లేదు. చలో విజయవాడకు వెళ్లిన అంగన్‌వాడీలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం తగదు. మహిళలని కూడా చూడకుండా పోలీసులు కర్కశంగా వ్యవహరించారు. తెలియని ప్రదేశాలకు తరలించారు. మహిళల పట్ల ఇంత క్రూరంగా వ్యవహించిన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు.

-ఎస్.రాధ, అంగన్‌వాడీ టీచర్

ప్రభుత్వ నిరంకుశ వైఖరి తగదు

అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం ఇంత నిరంకుశంగా వ్యవహరించడం తగదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి. సమస్యలను పరిష్కరించాలి. మహిళలని కూడా చూడకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదు

-బి.రామలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్

బంద్‌ను జయప్రదం చేయాలి

అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం అత్యంత కర్కశకంగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా ఈ నెల 24న తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలి. ప్రజలు, రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా, కర్షక సంఘాలు మద్దతు ఇవ్వాలి.

-జె.కామేశ్వరి, అంగన్‌వాడీ టీచర్

ఆమె ఓటు కీలకం

జిల్లాలో 16,05,762 మంది ఓటర్లు

మహిళా ఓటర్లే అధికం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఈ సారి ఎన్నికల్లో మహిళా ఓట్లు కీలకం కానున్నాయి. జిల్లాలో ఓటర్ల తుది జాబితా విడుదలైంది. జిల్లాలో 16,05,762 మందికి ఓటుహక్కును కల్పించారు. ఆ మేరకు 2024 ఎస్ఎస్ఆర్ జాబితాను సోమవారం విడుదల చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ 2024కు జనవరి 12 వరకు ఎన్నికల సంఘం గడువు పొడిగించిన విషయం విధితమే. ఈ మేరకు ఆ తేదీ నాటికి అందిన మొత్తం దరఖాస్తులను పరిశీలించి ఓటర్ల జాబితాను విడుదల చేశారు. గత ఓటర్ల జాబితా సవరణ అనంతరం జిల్లాలో 16,05,762 మంది ఓటర్ల జాబితాలో నమోదయ్యారు. గతంకంటే అదనంగా 53,494 మంది ఓటర్లుగా నమోదయ్యారు.

జిల్లాలో మొత్తం 16,05,752 మంది ఓటర్లు కాగా, 7,85,142 మంది పురుష ఓటర్లు, 8,20,515 మంది మహిళా ఓటర్లు, 105 మంది ట్రాన్సజెండర్స్ ఓట్లు ఉన్నాయన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో 2, 71,159 మంది ఓటర్లు నమోదు కావడంతో జిల్లాలో అతిపెద్ద నియోజకవర్గంగా నిలిచింది. కొవ్వూరు నియోజకవర్గం కేవలం 1,83,405 ఓటర్ల నమోదు అత్యల్ప నియోజకవర్గంగా నిలిచింది.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా. :

రాజమండ్రి అర్బన్ శాసనసభ 260360 నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు కాగా, 125639 మంది పురుష ఓటర్లు, 134663 మంది మహిళా ఓటర్లు, 58 మంది ట్రాన్సజెండర్లు ఓటర్లుగా ఉన్నారు.

రాజమండ్రి రూరల్ శాసనసభ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 271159 కాగా, 132531 మంది పురుష ఓటర్లు, 138604 మంది మహిళా ఓటర్లు, 24 మంది ట్రాన్సజెండర్లు ఓటర్లుగా ఉన్నారు.

రాజానగరం శాసనసభ నియోజకవర్గంలో మొత్తం 213911 ఓటర్లు కాగా, 105824 మంది పురుష ఓటర్లు, 108083 మంది మహిళా ఓటర్లు, 4 మంది ట్రాన్సజెండర్లు ఓటర్లుగా ఉన్నారు.

అనపర్తి శాసనసభ నియోజకవర్గంలో మొత్తం 223255 ఓటర్లు కాగా, 109323 మంది పురుష ఓటర్లు, 113930 మంది మహిళా ఓటర్లు, 2 మంది ట్రాన్సజెండర్లు ఓటర్లుగా ఉన్నారు.

నిడదవోలు శాసనసభ నియోజకవర్గంలో మొత్తం 211874 ఓటర్లు కాగా, 103600 మంది పురుష ఓటర్లు, 108269 మంది మహిళా ఓటర్లు, 5 మంది ట్రాన్సజెండర్లు ఓటర్లుగా ఉన్నారు.

కొవ్వూరు శాసనసభ నియోజకవర్గంలో మొత్తం 183405 ఓటర్లు కాగా, 89442 మంది పురుష ఓటర్లు, 93958 మంది మహిళా ఓటర్లు, 5 మంది ట్రాన్సజెండర్లు ఓటర్లుగా ఉన్నారు.

గోపాలపురం శాసనసభ నియోజక వర్గంలో మొత్తం 2,41,798 ఓటర్లు కాగా, 118783 మంది పురుష ఓటర్లు, 123008 మంది మహిళా ఓటర్లు, 7 మంది ట్రాన్సజెండర్లు ఓటర్లుగా ఉన్నారు.

తాళ్లపూడిలో 44 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ జాబితాలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయం, మండలంలోని 44 పోలింగ్ కేంద్రాల వద్ద 2024 ఓటర్ తుది జాబితాలను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం ప్రదర్శించామని తహశీల్దార్ టి.రాధిక తెలిపారు. ఆయా కేంద్రాలకు సంబంధించిన ఓటర్లు జాబితాలను పరిశీలించుకుని ఓటు ఉందో లేదో తెలుసుకోవచ్చని తెలిపారు. రాజకీయ పార్టీలు కూడా ఓటర్ల వివరాలు చూసుకోవచ్చన్నారు. ఏమైనా తేడాలుంటే తమ సిబ్బందికి తెలియజేయొచ్చన్నారు.

జనసేన ఆర్థిక సాయం

ప్రజాశక్తి- దేవరపల్లి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగాయిగూడెం గ్రామానికి చెందిన ఎలిపిన సూర్యచంద్ర కుటుంబానికి జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు కాట్నం గణేష్, సోమిసెట్టి శ్రీను, సర్పంచ్ కరుటూరు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు

ధవళేశ్వరం సిఐగా వినయ్‌మోహన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం సిఐగా జివి.వినయ్ మోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పిసిఆర్ విజయవాడ పోలీస్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించారు. ఆయన 2001 నుంచి 2003 వరకు ధవళేశ్వరంలో ఎస్‌గా విధులు నిర్వహించారు. ఇప్పటి వకరూ సిఐగా ఉన్న మంగాదేవి బదిలీ అయిన నేపథ్యంలో ఆయన ఇక్కడ నియమితులయ్యారు.

నర్సరీలను సందర్శించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి- కడియం

కడియం పల్ల వెంకన్న, శ్రీ సత్యదేవా నర్సరీలను తూర్పుగోదావరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు దంపతులు సోమవారం సంద ర్శించారు. నర్సరీ యాజమానులు వారికి స్వాగతం పలికారు. వివిధ మొక్కలను పరిశీలించారు. శ్రీ సత్యదేవా నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ శ్రీ రాముని ప్రతిరూపం, అయోధ్య ఆలయ నమూనా తోకూడిన బొమ్మలను వారికి అందజేశారు.

అంగన్‌వాడీలపై కర్కశం

ప్రజాశకి - యంత్రాంగం

చలో విజయవాడ పిలుపు మేరకు విజయవాడకు బయలుదేరిన అంగన్‌వాడీలపై ప్రభ్వుం నిర్బంధానికి పాల్పడింది. ఎక్కడికక్కడ వారిని అరెస్టు చేస్తూ సుదూర ప్రాంతాలకు బస్సుల్లో తరలించింది. అరెస్టుల పేర నాయకులపై దాడికి పాల్పడింది. స్పెషల్ బ్రాంచి సిఐ వెంకటేశ్వర్లు నాయకుల పట్ల కర్కశకంగా వ్యవహరించారు. సిఐటియు నాయకుడు క్రాంతికుమార్‌పై పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. నిర్బంధాలను ఎదుర్కొని పలువురు అంగన్‌వాడీలు విజయవాడ చేరుకున్నారు. **తాళ్లపూడికి** చెందిన పలువరు అంగన్‌వాడీలు ముందుగానే విజయవాడకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు జ్యోతి మాట్లాడారు. విజయవాడ చేరుకున్నప్పటికీ ప్రభుత్వం కార్యకర్తలను నిర్బందించి వివిధ ప్రాంతాలకు తరలించారన్నారు. తమకు న్యాయం జరిగే వరకూ ఎంతటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. **చాగల్లు** మండలంలో అంగన్‌వాడీలకు పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చి హౌస్ అరెస్టు చేశారు. ఎక్కడ ఎక్కడ అంగనవాడీలను అడ్డుకున్నారు. ఈ అరెస్టులను నాయకులు ఖండించారు. భవిష్యత్తులో ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు అంగన్‌వాడీల అరెస్టులను సిఐటియు, సిపిఎం నాయకులు ఖండించారు. ఇది అప్రజాస్వామికమని సిపిఎం నాయకులు ఎకె.దుర్గారావు అన్నారు. వారి అరెస్టులను ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గారపాటి సుబ్బారావు, కంకటాల బుద్ధుడు, ఎస్‌కె.ఆదం, జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి** వివిధ జిల్లాలకు చెందిన సుమారు 250 మంది అంగన్‌వాడీలను కరుటూరి ఫంక్షన్ హాల్లో నిర్బంధించారు. విజయవాడ, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, కర్నూలు, శ్రీకాకుళం, పలాస జిల్లాల కు చెందిన అంగన్‌వాడీలుగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సిపిఎం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, సిఐటియు నాయకులు కె.రత్నాజీ టిడిపి గోపాలపురం ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకట్రాజు, టిడిపి నాయకులు ఆంద్రు అనిల్, గన్నమని హరికృష్ణ తదితరులు అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. **గోపాలపురం** కెఎస్.రెడ్డి ఫంక్షన్ హాల్లో వివిధ జిల్లాలకు చెందిన సుమారు 60 మందిని పోలీసులు నిర్బంధించారు. అనకాపల్లి, చిత్తూరు కోనసీమ, విజయవాడ-3, ఏలూరు, విశాఖ, రాజమహేంద్రవరానికి చెందిన వారు ఉన్నారు. వీరిని తిరిగి ఏలూరు బస్టాండ్‌కు పంపించేశామని ఎస్‌ఐ తెలిపారు. **ఉండ్రాజవరం** మండలంలోని దమ్మెన్ను గ్రామానికి చెందిన ఇద్దరు అంగన్‌వాడీలు కె.వెంకటలక్ష్మి, సిహెచ్.సుధా రాణలను తణుకు రైల్వే స్టేషన్లో పోలీసులు అరెస్టు చేశారు. వారికి ఒక ప్రయివేటు ఫంక్షన్ హాల్లో నిర్బంధించారు. నాయకురాలు ఎస్ రంగనాయకమ్మ, మరికొందరు సుమారు 15 మంది విజయవాడలోనే ఉండి పోయారు. ఇదిలా ఉండగా మండలంలో 12 మంది అంగన్‌వాడీ టీచర్లు, 12 మంది ఆయాలు విధులకు హాజరయ్యారని సిడిపిఒ తెలిపారు. **నలజర్లలో** అంగన్‌వాడీలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ అరెస్టులను సిఐటియు జిల్లా నాయకులు కొక్కిరిపాటి వెంకట్రావు తీవ్రంగా ఖండించారు. రాత్రి ఏడు గంటలైన అంగన్‌వాడీలను విడుదల చేయకపోవడంతో పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. వెంకట్రావు మాట్లాడుతూ విశాఖ జిల్లాకు చెందిన 42 మంది అంగన్‌వాడీలను అక్రమంగా అరెస్టు చేశారన్నారు.

ఉండ్రాజవరానికి చెందినఅంగన్‌వాడీల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

దేవరపల్లిలో అంగన్‌వాడీలను పరామర్శిస్తున్న నాయకులు

24న అంగన్‌వాడీలకు మద్దతుగా బంద్

అంగన్‌వాడీలక మద్దతుగా ఈ నెల 24న బంద్‌కు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశాయి. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు 42 రోజులుగా సమ్మె చేస్తున్నారన్నారు. వారికి మద్దతుగా ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాలను సిఎం జగన్‌కు అందించేందుకు విజయవాడకు బయలు దేరారన్నారు. వారిపై ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి పాశవికంగా దాడి చేయించిందన్నారు. డిమాండ్లను నెరవేర్చకుండా ఎస్మాను ప్రయోగించిందన్నారు. నిరవధిక దీక్షా శిబిరాన్ని కూల్చారన్నారు. దీక్షలు చేస్తున్న నాయకులను దూరప్రాంతాలకు తరలించి నిర్బంధించారన్నారు. వారి ఆరోగ్యాన్నికూడా పట్టించుకోలేదని తెలిపారు. కరెంటు తీసివేసి మహిళలను సైతం మగ పోలీసులతో అరెస్టు చేయించారన్నారు. దీక్షలకు మద్దతుగా పాల్గొన్న సుమారు 2 వేల మంది అరెస్టుచేసి మచిలీపట్నం, నూజివీడు తదితర సుదూర ప్రాంతాలకు తరలించారన్నారు. మహిళా కార్మికులపట్ల రాష్ట్ర ప్రభుత్వ పాశవిక విధానానికి వ్యతిరేకంగా, అంగన్‌వాడీలకు సంఘీభావంగా రాష్ట్ర అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు 24న బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. అందరూ మద్దతు ఇచ్చి బంద్‌ను జయప్రదం చేయాలన్నారు.

ధర్నా చేస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు, అంగన్‌వాడీలు,

అరెస్టులపై కార్మిక సంఘాల ధర్నా

రాజమహేంద్రవరం : అంగన్‌వాడీల అరెస్టులు అప్రజాస్వామికమని పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి అరెస్టులకు నిరసనగా రాజమహేంద్రవరంలో శ్యామల సెంటర్ వద్ద సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి, ఎఐటియుసి సీనియర్ నాయకులు నల్లా రామారావు, ఐఎఫ్‌టియు నాయకులు కె.జోజి మాట్లాడారు. తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకొచ్చాక వేతనాలు పెంచకుండా అన్యాయం చేశారన్నారు. దీనికి నిరసనగా సామరస్యంగా చట్టబద్ధంగా సమ్మె చేస్తుంటే అరెస్టులు, బెదిరింపులు, ఎస్మ ప్రయోగం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించడం వంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత మూడు గంటల సమయంలో దీక్షా శిబిరంపై శత్రుదేశంపై దాడి చేసినట్టు మగ పోలీసులు సైతం అంగన్‌వాడీలపై దాడి చేశారన్నారు. ఐదు రోజులుగా నిరవధిక దీక్షలో ఉన్న అంగన్‌వాడీ నాయకులను విచక్షణ రహితంగా ఈడ్చిపడేశారన్నారు. ఇది దుర్మార్గమైన చర్య అని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్‌వాడీలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కెఎస్‌వి.రామచంద్రరావు, కర్రి రామకృష్ణ, టి.సావిత్రి, సోమేశ్వరరావు, పి.తులసి, ఐ.సుబ్రహ్మణ్యం, పోలిన వెంకటేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు సప్పా. రమణ, జిఎ.రామారావు, ఐఎఫ్‌టియు నాయకులు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



విద్యార్థులకు ట్యాబుల పంపిణీ

ప్రజాశక్తి- కడియం, గోకవరం

ట్యాబులు అందిస్తున్న ఎంఇఒ లజపతిరాయ్

కడియం మండలంలోని మాధవరా యుడుపాలెం గ్రామ శివారు చైతన్యనగర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన పంపిణీలో ఎంఇఒ వి.లజపతిరాయ్ పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధించిన అంశాల కోసం మాత్రమే ట్యాబులను విద్యార్థులు ఉపయోగించాలని కోరారు. అలాగే ట్యాబులు వినియోగం పట్ల ఉపాధ్యాయులు, తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గొల్లపల్లి వెంకటేశ్వరరావు, రానా విమల, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ వల్లీ శ్రీనివాస్, ఎంఇఒ-2 వై.నాగేశ్వరరావు, కొంచాడ తిమోతి, బొల్లా ధనుంజయ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోకవరం మండలం లోని గుమ్మళ్లదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు సోమవారం పిఎంసి చైర్మన్ పి.చిన్ని, హెచ్‌ఎం కె.లక్ష్మీకాంతం ట్యాబులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడారు. విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే ట్యాబ్‌ల్లో పాఠాలను శ్రద్ధగా చూసి అవగాహన చేసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

వ్యవసాయ శాఖ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని, చిరు ధాన్యాలతో 100 పిండి వంటలు పుస్తకాన్ని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023ను ఐక్య రాజ్య సమితి చిరు ధాన్యాలు ఏడాదిగా ప్రకటించి, ఆ మేరకు మిల్లెట్స్ సాగు విస్తీర్ణం పెంచారన్నారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా వారు తీసుకునే ఆహారపు అలవాట్లలో చిరు ధాన్యాలు వినియోగం పెంచాల్సి ఉందన్నారు. ఆమేరకు చిరు ధాన్యాలుతో సుమారు 100 వంటలు పుస్తకం రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు రూపొందించి చిరు ధాన్యాలు ఆహారపు అలవాట్లు పై ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా అవగాహన అవసరం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జెసి ఎన్.తేజ్‌భరత్, డిఆర్ఒ జి.నరసింహులు, స్పెషల్ డిసి/ పర్యాటక శాఖ ఆర్‌డి వి.స్వామినాయుడు, డిఎఒ డాక్టర్ ఎస్.మాధవరావు, వ్యవసాయ జిల్లా అధ్యక్షులు డాక్టర్ డివి.కృష్ణ ఉపాధ్యక్షుడు డాక్టర్ డికె.మల్లికార్జున్, కార్యదర్శి డాక్టర్ కమల్‌రాజ్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ రాజారావు, కోశాధికారి డాక్టర్ రామ తులసి పాల్గొన్నారు.

సభా స్థలాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

'రా కదలిరా' సభ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -నల్లజర్ల

నల్లజర్ల మండలం దూబచర్లలో చేబ్రోలు రోడ్డు సమీపంలో రా కదలిరా సభ కోసం రైతు పొలాన్ని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిపాటి వెంకటరాజు, టిడిపి రాజమహేంద్రవరం పార్లమెంట్ అధ్యక్షులు, మాజీ మంత్రి కెఎస్.జవహర్ సోమవారం పరిశీలించారు. వీరితో పాటు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇంచార్జ్ మందలపు రవి, ప్రోగ్రాం ఇన్‌ఛార్జ్ రాజశేఖర్, రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మండల అధ్యక్షులు తాతిన సత్యనారాయణ. దేవరపల్లి మండల టిడిపి అధ్యక్షులు ఆంద్రు అనిల్, ఉంగుటూరు నియోజకవర్గం పరిశీలకులు షేక్ మేరా సాహెబ్ ఉన్నారు. హెలీప్యాడ్, సభ వేదిక స్థలాన్ని పరిశీలించారు. వాహనాల పార్కింగ్ తదితర అంశాలను చర్చించారు. వీరిలో క్లస్టర్ ఇన్‌ఛార్జి కూచిపూడి ఉదయ భాస్కర్, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, గ్రామ కమిటీ అధ్యక్షులు అప్పసాని రాంబాబు, యూనిట్ ఇన్‌ఛార్జి ముదునూరి ఆదినారాయణ తదితరులున్నారు.

నేరాలు ఘోరాలు

మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్న అధికారులు

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-కాట్రేనికోన

ఫైబర్ బోటులో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బలుసుతిప్పలోని గోదావరి నది పాయలో ఫైబర్ బోటులో నిల్వ ఉంచిన 1,079 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.లక్షా 25 వేల విలువ ఉంటుందని చెప్పారు. అక్రమ మద్యాన్ని నిల్వ ఉంచిన బోటు ఎవరిది, ఎవరు నిల్వ చేశారో దర్యాప్తు చేస్తున్నామని ముమ్మిడివరం సిఐ కొండయ్య తెలిపారు. యానాం నుంచి ఎవరైనా పెద్ద మొత్తంలో మద్యాన్ని కొనుగోలు చేసి సరఫరా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, యానాం షాపులలో చట్టపరంగా కాకుండా ఎక్కువ మొత్తంలో అక్రమంగా మద్యాన్ని అమ్మితే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని సెబ్ ఎస్.ఐ రాజేష్ హెచ్చరించారు.

1398 బాటిళ్ల మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

అక్రమంగా యానాం నుంచి మద్యం తీసుకువచ్చి అమ్ముతున్న ఒకరిని అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించినట్లు కోరంగి ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని కోరంగి పంచాయితీ చిన్న బొడ్డు వెంకటాయపాలెంలో అక్రమంగా నిల్వ ఉంచి అమ్మకానికి సిద్ధంగా ఉన్న 1398 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని గ్రామానికి చెందిన పెశింగి దుర్గను అరెస్టు చేసి కేసు నమోదు చేసి కాకినాడ కోర్టుకు తరలించారు.

లారీని ఢీకొన్న వ్యాన్

ప్రజాశక్తి - గోపాలపురం

లారీ బ్రేక్ వేయడంతో ఐషర్ వ్యాన్ అదుపుతప్పి లారీని ఢీకొంది. ఆదివారం అర్ధరాత్రి గోపాలపురం శివారు దుర్గమ్మ గుడి సమీపంలో గీ ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి కలకత్తాకు పైపులు లోడుతో ఐషర్ వ్యాన్ బయలుదేరింది. గోపాలపురం శివారు దుర్గమ్మ గుడి సమీపంలో వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న వ్యాన్ లారీ వెనకవైపు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

గ్యాస్ సిలెండర్‌ల స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మండలంలోని పలు హోటల్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లలో వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్‌లు ఉపయోగిస్తుండటంతో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండల సివిల్ సప్లై అధికారి కీర్తి ఆధ్వర్యంలో సోమవారం అధికారులు పలు హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు హోటల్ లో కమర్షియల్ సిలిండర్ లకు బదులుగా డోమెస్టిక్ సిలిండర్ లు వాడుతున్నట్లు గుర్తించి వ్యాపారుల నుంచి 7 డోమెస్టిక్ సిలిండర్ లను సీజ్ చేసి హోటల్ నిర్వాహకులపై 6(ఎ) కేసులను నమోదు చేశారు. ఈ దాడుల్లో సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక హత్య కేసులో తల్లికి శిక్ష

ప్రజాశక్తి - కాకినాడ

బాలిక హత్య కేసులో నేరం రుజువు కావడంతో సవతి తల్లికి కాకినాడ 4వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. కాకినాడ వన్ టౌన్ ఎస్‌హెచ్ఒ వి.సురేష్ బాబు వెల్లడించిన వివరాల ప్రకారం...2019 నవంబర్ 22న జగన్నాథపురంలోని నేతాజీ మున్సిపల్ స్కూల్లో రెండవ తరగతి చదువుతున్న సూరడ దీప్తి అనే అమ్మాయిని సవతి తల్లి సూరాడ శాంతి కుమారి స్కూల్ నుంచి ఇంటికి తీసుకువెళ్లి టవల్‌తో పీక బిగించి హత్య చేసింది. అనంతరం ఇంద్ర పాలెం బ్రిడ్జి నుంచి ఉప్పుటేరు కాలువలో విసిరేసింది. దీప్తి తండ్రి సత్య శ్యాంకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వన్ టౌన్ ఎస్ఐ సుప్రియ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ పూర్తయిన అనంతరం చార్జిషీటు న్యాయస్థానంలో ఫైల్ చేశారు. సాక్షుల విచారణ, వాదోపవాదనలు విన్న అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయి సూరాడ శాంతి కుమారికి సోమవారం యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతి కుమారి వాదనలు విన్పించారు. ఈ కేసులో ముద్దాయిని అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన పోలీసులను డిఎస్‌పి పి.మురళీకృష్ణారెడ్డి, ఇతర అధికారులను ఎస్‌పి అభినందించారు.

విద్యుదాఘాతంతో లైన్‌మేన్ మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు



లైన్‌మేన్ రాంబాబు

గోగన్నమఠంలో సోమవారం సాయంత్రం విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్‌షాక్‌తో లైన్‌మేన్ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎలక్ట్రికల్ లైన్‌మేన్ నౌండ్రు రాంబాబు (46) విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే చనిపోయినట్లు స్థానికులు నగరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాంబాబు మతితో వాకలగరువులో విషాద ఛాయలు చోటు చేసుకున్నాయి. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరు ముగ్గురు సోదరులు కాగా ఇటీవలే మూడో సోదరుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం నిరాశ్రయమయ్యింది. ఇటీవల పాశర్లపూడిలో విద్యుత్ మరమ్మతులు చేస్తూ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటన మరువక ముందే మరో సంఘటన చోటు చేసుకోవడంతో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శిరోముండనం బాధితులకు సర్టిఫికెట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

శిరోముండనం బాధితులకు కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే మంజూరు చేయాలని పలువురు ప్రజాసంఘాల నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో దళిత ఐక్య పోరాట వేదిక కన్వీనర్ వి.భీమాశంకర్, కో కన్వీనర్లు సిహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వెంకటాయపాలెం శిరోముండనం బాధితులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా రెవెన్యూ అధికారులు శిరోముండనం బాధితులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారన్నారు. ఈ జాప్యానికి కారణం ఈ కేసులో మొదటి ముద్దాయిగా ఉన్న ప్రస్తుత ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు రెవెన్యూ యంత్రాగాన్ని పావులా వాడుకుంటున్నారన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పిల్లల చదువు కోసం శిరోముండనం బాధితులు కుల ధ్రువీకరణ పత్రాలు అడిగినా ఇవ్వడం లేదని, శిరోముండనం బాధితులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తే తోట త్రిమూర్తులుకు ఎక్కడ శిక్షపడిపోతుందో అనే భయంతో 28 సంవత్సరాల నుంచి జాప్యం చేస్తున్నారన్నారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రెవెన్యూ అధికారులు అమలు చేయాలని, శిరోముండనం బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రామచంద్రపురం తహశీల్దార్ వెంకటేశ్వరరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంటపల్లి రామకృష్ణ, చల్లపూడి పట్టాభి, అంబటి కృష్ణ, గుబ్బల శ్రీను, రాజా రెడ్డి, రామయ్య, టి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న దళిత నాయకులు

నిషేధిత సిగరెట్లు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నిషేధిత సిగరెట్లు నిల్వ చేసినా, అమ్మినా చర్యలు తప్పవని ఇన్‌చార్జి రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.సురేష్‌బాబు హెచ్చరించారు. సోమవారం నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలకు సంబంధించి విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. రాజమహేంద్రవరం స్టేడియం రోడ్డులోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో గల శ్రీదేవి బిస్కట్స్ అండ్ జనరల్ స్టోర్‌లో నిషేధిత సిగరెట్ ప్యాకెట్లు గుర్తించామన్నారు. 4,010 ప్యాకెట్లను సీజ్ చేశామన్నారు.వీటి విలువ రూ.1.75 లక్షలు ఉంటుందన్నారు. యజమాని దాసరి వెంకటకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు. టూటౌన్ పోలీసు స్టేషన్‌కు అప్పగించామన్నారు. కాకినాడ నుంచి కొనుగోలు చేసినట్టు తెలిసిందన్నారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ నాగవెంకటరాజు, తహశీల్దార్ విజయకుమార్, కార్యాలయపు సబ్- ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

హుకుంపేటలో వైసిపి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

హుకుంపేటలో బొప్పన సుబ్బారావు స్వగృహంలో వైసిపి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. మంత్రి చెల్లబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర పచ్చదనం మరియు సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, పిఎసిఎస్ అధ్యక్షులు బొప్పన సుబ్బారావు, జిల్లా వాణిజ్య విభాగం సంయుక్త కార్యదర్శి పడాల వీర్రాజురెడ్డి, ఇబ్రహీం భాషా, సిరసపల్లి శంకర్రావు, ముందరపల్లి అనిల్, చీర రాజు, రేలంగి సత్యనారాయణ, దాసరి శివకుమార్, కోదాటి సతీష్‌కుమార్, చిటికెన ప్రసాద్, పాసర్లపూడి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరిని అభినందిస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ

లోకేశ్వరికి ఎంఎల్ఎ అభినందన

ప్రజాశక్తి-కాట్రేనికోన

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఎస్ఐగా ఎంపికైన తిరుమాని లోకేశ్వరిని ముమ్మిడివరం ఉఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ అభినందించారు. బలుసుతిప్ప గ్రామానికి చెందిన లోకేశ్వరిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఈ అభినందన కార్యక్రమంలో ఓలేటి సతీష్, నాతి అలివేణి, మల్లాడి ఏడుకొండలు, నల్లా నరసింహమూర్తి పాల్గొన్నారు.

సహజ వనరుల్ని దోచేస్తున్నారు

ప్రజాశక్తి - ఆలమూరు

వైసిపి నాయకులు సహజ వనరులను దోచేస్తున్నారని జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ ఆరోపించారు. మండలంలోని జొన్నాడ ఇసుక ర్యాంపులో సోమవారం బాట ఛార్జీలకు వ్యతిరేకంగా లారీ ఓనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాట ఛార్జీల పేరుతో సామాన్యుల్ని బాదేస్తున్నారని, పేదవాడు గూడు కట్టుకోవడానికి గుప్పెడు ఇసుక దొరక్కుండా దోచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చూపించే బిల్లులు 40 శాతం ఉంటే 60 శాతం దొంగ బిల్లులతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని ఆయన అన్నారు. మీటరు తవ్వాల్సిన చోట 13 అడుగులు 14 అడుగుల వరకు తవ్వేసి నదీ గర్భాన్ని తూట్లు పొడుస్తున్నారన్నారు. వెంటనే ఈ ఛార్జీలను రద్దు చేసి ఇసుక సామాన్యుడికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సంగీత సుభాష్, కట్టా శ్రీనివాస్, తాళ్ల డేవిడ్, సూరపరెడ్డి సత్య, ఎంపిటిసి తమ్మన భాస్కరరావు, పడాల అమ్మిరాజు, సలాది జయప్రకాశ్, పాల్గొన్నారు.

హెచ్‌డిఎఫ్‌సి బిజినెస్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-అమలాపురం

ప్రభుత్వ ఉద్యోగులు, కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెచ్‌డిఎఫ్‌సి బిజినెస్ కరస్పాండెంట్ కామన్ సర్వీస్ సెంటర్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ బ్యాంక్ సేవలు, సిటిజన్ సర్వీసులు అన్ని స్థానిక కామన్ సర్వీస్ సెంటర్‌లో లభిస్తాయన్నారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తరపున అఫీషియల్ ఔట్‌లెట్ బిజినెస్ కరస్పాండెంట్ కామన్ సర్వీస్ సెంటర్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు 26 రకాల బ్యాంకింగ్, సిటిజన్ సేవలను అందిస్తుందన్నారు. వీటిలో సేవింగ్స్, కరెంట్ శాలరీ ఖాతాలు, బంగారు ఆభరణాలపై తాకట్టు రుణాలు, ఫిక్స్, రికరింగ్ డిపాజిట్ల సేకరణ, ట్రాక్టర్ రుణాలు, గృహ రుణాలు, రైత్వారీ ఖాతాలు, వినియోగదారుల డ్యురెబుల్ రుణాలు, బైకుల రుణాలు సామాజిక భద్రత పథకాలు నగదు డిపాజిట్, విత్ డ్రా, ఇఎంఐ చెల్లింపులు, స్వీకరణ, రూ.పది వేల వరకు నగదు లావాదేవీలకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబు, నిమ్మల సత్యనారాయణ, వెంకట సూర్య రాజ కిరణ్, ఆకెళ్ల శ్రీనివాస్, గంధం గణపతిరావు, రాజేష్, కె.శ్యామ్‌బాబు, శివశంకర్ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అమలాపురం మండలం చిందాడగరువు ఎంపిటిసి మోటూరి కనకదుర్గ, ఆమె భర్త వెంకటేశ్వరరావు సౌజన్యంతో సమకూర్చిన 150 దుప్పట్లను నిరుపేదలకు పంపిణీ చేశారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

తీర ప్రాంతాలకు తాగునీరు అందజేత : పొన్నాడ

ప్రజాశక్తి-కాట్రేనికోన

తీర ప్రాంత గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని తీర ప్రాంతమైన బలుసుతిప్పలో సిఎస్ఆర్ నిధులు రూ.39 లక్షలతో నిర్మించనున్న ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి, జల జీవన్ నిధులు రూ.94 లక్షలతో ఇంటింటికీ తాగునీరు కుళాయిలు ఏర్పాటు చేసేందుకు సోమవారం ఎంఎల్ఎ పొన్నాడ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరికీ సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాలెపు లక్ష్మి ధర్మారావు, నల్లా నరసింహమూర్తి, సర్పంచులు మల్లాడి ఏడుకొండలు, ఆదినారాయణ, నాతి అలివేణి సత్యనారాయణ, ఇసుకపట్ల శ్రీనుబాబు, ఓలేటి సతీష్, సంసాని నాగేశ్వరరావు, తిరుమాని సత్తిబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ స్వామి, ఎఇ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

స్పందనలో వచ్చిన అర్జీలను అధికారులు విచారించి నిర్ణీత కాలవ్యవధిలోనే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్పందనలో ఆమె జెసి ఎన్.తేజ్‌భరత్, డిఆర్ఒ నరసింహులుతో కలిసి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. స్పందనలో 131 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించామన్నారు. సమస్యలు పరిష్కారం కోసం అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. స్పందనలో నమోదైన ప్రతి అర్జీని పరిష్కరించాలని సూచించారు. జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో వచ్చిన ఆర్జీలను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పునరావృతమయ్యే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెసి ఎన్.తేజ్ భరత్, డిఆర్ఒ జి.నరసింహులు, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు వి.స్వామినాయుడు, డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిసిహెచ్ఒ డాక్టర్ ఎం.సనత్‌కుమారి, సిపిఒ ఎల్.అప్పల కొండ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, డిఇఒ అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న కుల గణన సర్వే

ప్రజాశక్తి-అమలాపురం

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన అమలాపురం మున్సిపాలిటీలో ఊపందుకుంది. కొన్ని సమయాల్లో సర్వర్ సమస్య తలెత్తినప్పటికీ సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్స్ ఇంటింటికీ వెళ్లి కుల గణన సర్వే చేపడుతున్నారు. అమలాపురం మున్సిపాలిటీలో 15 వార్డ్ సచివాలయాల్లో ఉన్న 302 క్లస్టర్స్‌లో కుల గణన సర్వే చేపట్టారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 17,213 కుటుంబాలు, 48,582 సభ్యులు ఉండడంతో సర్వే వేగంగా పూర్తి చేయడానికి మున్సిపల్ కమిషనర్ వొమ్మోలు అయ్యప్ప నాయుడు కసరత్తు మొదలు పెట్టారు. ప్రధానంగా ఈ సర్వేలో బియ్యం కార్డ్ నంబర్, నివాసం ఉంటున్న ఇంటి రకం, మరుగుదొడ్ల సౌకర్యం, తాగునీరు, గ్యాస్ సదుపాయం, పశు సంపద, కులం, ఉపకులం, పుట్టిన తేది, విద్యార్హతలు, వృత్తి వంటి తదితర వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఈ నెల 19 వ తేదీన ప్రారంభమైన కుల గణన ఇంటింటి సర్వే 28వ తేదీ లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

విద్యుర్థులు ట్యాబ్‌లను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి-రావులపాలెం

పాఠశాలల్లో విద్యార్థులంతా ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లున ఉపయోగించుకోవలని రావులపాడు సర్పంచ్ మట్టా సత్యదేవి బాబ్జి అన్నారు. సోమవారం స్థానిక పాఠశాలలో హెచ్‌ఎం సునీత అధ్యక్షతన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. సర్పంచ్ సత్యదేవి మాట్లాడుతూ సిఎం వైఎస్.జగన్ విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ సకల సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఆశ కిషోర్, టీచర్ కె.వి శేఖర్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా రూ .5 లక్షల అందజేత

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని 26 వార్డుకు చెందిన గుబ్బల లక్ష్మి ఇటీవల తొస్సిపూడి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆమెకు వైయస్సార్ బీమా పథకం నుండి రూ.5 లక్షల మంజూరయ్యాయి. ఈ మొత్తాన్ని మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి మృతురాలి భర్త కృష్ణకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పరిశీలన

కపిలేశ్వరపురం : మండలంలోని అంగర పిహెచ్‌సి పరిధిలోని పడమర ఖండ్రికలో ఆరోగ్య సిబ్బంది పంపిణీ చేస్తున్న ఆరోగ్యశ్రీ కార్డులు, బ్రోచర్లను జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. ఆరోగ్యశ్రీ యాప్ డౌన్లోడ్, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్యక్రమంపై రూపొందించిన వీడియోను, అవగాహన కలిగిస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సికి సంబంధించిన వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

250 మంది అంగన్‌వాడీలకు భోజనం ఏర్పాటు

ప్రజాశక్తి- దేవరపల్లి

విజయవాడ నుంచి వివిధ జిల్లాలకు చెందిన సుమారు 250 మంది అంగన్‌వాడీ కార్యకర్తలను బస్సుల్లో దేవరపల్లి కరుటూరు ఫంక్షన్ హాల్ వద్దకు తరలించారు. వారికి స్థానిక సిఐ కె.రామకృష్ణ, ఎస్ఐ కె.శ్రీహరిరావు, ట్రైనీ డిఎస్‌పి భానోదయ ఆధ్వర్యంలో భోజనాలను సమకూర్చారు.

భోజనం వడ్డిస్తున్న పోలీసులు

సాగునీటి ఎద్దడిపై ఇరిగేషన్ ఎఇ నిర్బంధం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

తీవ్ర సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న రైతులు వంటకాలును పరిశీలించేందుకు వచ్చిన ఎఇని సోమవారం నిర్బంధించారు. వాడపర్రు పంట కాలువ శివారు కూనవరం టైలెండ్ ప్రాంతంలో వంటకాలువకు సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూనవరం ప్రాంతంలో వంటకాలువపై సుమారు 500 ఎకరాల వరకు వరి సాగు జరుగుతోంది. నారుమళ్లు వేసిన నాటి నుంచి సాగు నీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం నాట్లు వేసేందుకు చేలను సిద్ధం చేసినా సాగునీరు అందకపోవడంతో నాట్లు వేయలేకపోయామని రైతులు వాపోతున్నారు. ఈ సమయంలో ఇరిగేషన్ ఎఇ శివరామకృష్ణ పంట కాలువ పరిశీలనంచేందుకు వచ్చారు. దీంతో ఎఇని రైతులు చుట్టుముట్టి నిర్బంధించారు. సాగునీటి ఎద్దడి ఇబ్బందులపై అనేకసార్లు ఫోన్ చేసి తెలిపినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట కాలువలో పూడిక తొలగించే పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించామని, నెల రోజులగా తాను కాంట్రాక్టర్‌ను పూడిక తొలగించాలంటూ కోరుతున్నానని ఎఇ రైతులకు తెలిపారు. సుమారు 14 కిలోమీటర్లు పొడవు ఉన్న పంట కాలువ ఎగువ భాగంలో పూడిక తీత పనులు ప్రారంభమై ఇప్పటివరకు నాలుగు కిలోమీటర్ల మేర పూడిక తొలగించారని చెప్పారు. మరికొద్ది రోజుల్లో కూనవరం శివారు ప్రాంతంలో కూడా పూడికతీత పనులు జరుగుతాయన్నారు. ఇప్పటికే నారుమళ్లు ఎండిపోయి నాట్లు వేసే చేలు బీటలువారి పోతున్నాయని పంట కాలువ శివారు ప్రాంతం నుంచి పూడికతీత పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. సమస్యను ఎఎంసి డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, సహకార సొసైటీ చైర్మన్ ఊటాల రామాంజనేయులు మంత్రి పినిపే విశ్వరూప్‌కు ఫోన్ చేసి తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి విశ్వరూప్ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి జెసిబి ద్వారా వంటకాలువలో పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. మూడు రోజుల్లోగా కూనవరం శివారు ప్రాంతానికి సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటానని ఎఇ శివరామకృష్ణ రైతులకు హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

ఎఇని నిర్బంధించిన రైతులు

4వ విడత వైఎస్ఆర్ ఆసరాపై సమీక్ష

ప్రజాశక్తి - ఆలమూరు

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన ఎంపిడిఒ కె.జాన్ లింకన్ ఆధ్వర్యంలో 'నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరాకు సంబంధించి సోమవారం సమీఓఆ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 23న కొత్తూరు సెంటర్ ఎస్‌జెఆర్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న మండల పరిధిలోని పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, చింతలూరు, సూర్యారావపేట, కలవచర్లకు సంబంధించి స్వయం సహాయక సంఘాలకు ఆసరా అందజేస్తామని చెప్పారు. దీనికి ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమం జయప్రదం చేయాలని వారు కోరారు. మండల పరిధిలోని 18 గ్రామాలకు గాను 4వ విడత వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా 1654 గ్రూపులకు, 16,540 మంది సభ్యులకు, రూ.15.02 కోట్లు లబ్ధి చేకూరనుందన్నారు. దీంతో నాలుగు విడతలు మొత్తం కలిపి రూ.60.08 కోట్ల లబ్ధి చేకూరనుందన్నారు. నాలుగు విడతలకు గాను ఇప్పటికే మూడు విడతలు అందజేసినట్లు, 4వ విడత ఈ నెల 23 నుండి 31 వరకు స్థానిక ఎంఎల్ఎ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తూ లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఆయా గ్రామ మహిళా సంఘాలకు పూర్తి వివరాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్, ఎఎంసి చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, వైసిపి నేతలు నామాల శ్రీనివాస్, పాలంగి ఉమాదేవి, ఎపిఎం ధనరాజు పాల్గొన్నారు.

4వ విడత వైఎస్ఆర్ ఆసరాపై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తూరల తొలగింపుపై ధర్నా

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం చీపురుగూడెంలో ఆర్ అండ్ బి రోడ్డు కింద ఉన్న బ్రిటిష్ కాలం నాటి తూరలను తొలగిస్తే ఊరుకోబోమంటూ గ్రామస్తులు సోమవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. నల్లజర్ల నుంచి కొయ్యలగూడెం వైపు వెళ్లే రహదారిలో చీపురుగూడెం గ్రామంలో పూర్తిగా పాడైంది,కొద్దిరోజుల క్రితం నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఆ గ్రామంలోని రహదారిపై ఉన్న గుంతల్లో వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. కాగా ఇటీవల ఓ కాంట్రాక్టర్ సిమెంట్ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో ఊరు మధ్యలో రోడ్డుకు పడమర వైపు నుంచి తూర్పు వైపునకు రోడ్డుకు కింది భాగంలో బ్రిటిష్ కాలం నాటి సిమెంట్ తూరలు ఉన్నాయి. వాటి స్థానంలో నీటి పారుదల లెవెల్ ప్రకారం కొత్త తూరలను నిర్మించి రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్ ప్రయత్నిస్తుండగా గ్రామంలో కొంత మంది అడ్డుకున్నారు. నల్లజర్ల సిఐ, ఎస్ఐ, తహశీల్దార్ ఘటన స్థలానికి చేరుకుని ఇరువురితో చర్చించారు. ఆ స్థానంలో సుమారు 12 మీటర్ల పొడవు నిర్మించకుండా మిగిలిన రోడ్డు అంతా నిర్మించుకునే విధంగా మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఆర్‌అండ్‌బి. డిఇ వచ్చి పరిస్థితిని సరిచేయాలని గ్రామస్తులు పట్టుబట్టారు.

In the Court of the Prl. Junior Civil Judge, Rajahmundry
O.S. 194/2015

Between:
Y.Atchamma (died) and Others ***...Plaintiffs***
AND
S.Nageswara Rao and Others ***...Defendants***

D-4: Vattikuti Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

D-5: Vattikuti Ajay, S/o. Venkata Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

D-6: Vattikuti Sowmya, D/o. Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

పై నెంబరులో మీకు శ్రీ కోర్టు వారు ది. **30-1-2024 సం॥ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

వాది తరపు అడ్వకేట్స్
G.SRINIVASULU REDDY
K.V.N.BHOTLU
Advocates, Rajahmundry

In the Court of the Prl. Junior Civil Judge, Rajahmundry
O.S. 195/2015

Between:
Yeluri Venkata Ramana @ Venkata Lakshmi ***...Plaintiff***
AND
S.Nageswara Rao and Others ***...Defendants***

D-4: Vattikuti Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

D-5: Vattikuti Ajay, S/o. Venkata Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

D-6: Vattikuti Sowmya, D/o. Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

పై నెంబరులో మీకు శ్రీ కోర్టు వారు ది. **30-1-2024 సం॥ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

వాది తరపు అడ్వకేట్స్
G.SRINIVASULU REDDY
K.V.N.BHOTLU
Advocates, Rajahmundry

In the Court of the Prl. Junior Civil Judge, Rajahmundry
O.S. 196/2015

Between:
Yeluri Kameswari ***...Plaintiff***
AND
S.Nageswara Rao and Others ***...Defendants***

D-4: Vattikuti Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

D-5: Vattikuti Ajay, S/o. Venkata Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

D-6: Vattikuti Sowmya, D/o. Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

పై నెంబరులో మీకు శ్రీ కోర్టు వారు ది. **30-1-2024 సం॥ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

వాది తరపు అడ్వకేట్స్
G.SRINIVASULU REDDY
K.V.N.BHOTLU
Advocates, Rajahmundry